ఆరుతడి పంటలు కళకళ

శిరివెళ్ల: మండలంలో బావులు, బోర్లు, వర్షాధారంగా వేసిన ఆరుతడి పంటలు కళకళలాడుతున్నాయి. అత్యధికంగా మినుము పంట సాగైంది. 599 హెక్టార్లలో పంటలు సాగు కాగా అందులో 509 హెక్టార్లు మినుము, 76 హెక్టార్లులో మొక్క జొన్న, 14 హెక్టార్లలో పెసర పంట సాగైంది. గ్రామాల వారీగా.. గుంప్రమాన్‌దిన్నెలో 400 హెక్టార్లు మినుము పంట, 10 హెక్టార్లలో పెసర పంట వేశారు. శిరివెళ్లలో 8 హెక్టార్లలో మినుము, 11 హెక్టార్లలో మొక్క జొన్న, యర్రగుంట్లలో 30 హెక్టార్లలో మినుము, జీనేపల్లెలో 16 హెక్టార్లులో మినుము పంట వేశారు. గోవిందపల్లెలో 40 హెక్టార్లలో మొక్కజొన్న, 55 హెక్టార్లలో మినుము, మహదేవపురంలో 10 హెక్టార్లు, గుండంపాడులో 15 హెక్టార్లలో మొక్క జొన్న సాగైంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పంటలు పచ్చదనం పులుముకున్నాయి.

దొర్నిపాడు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలు రైతులను మురిపిస్తున్నాయి. ప్రస్తుతం ఖరీఫ్‌లో భాగంగా సాగు చేసిన మినుము, మొక్కజొన్న పంటలకు ఈ జల్లులు ఉపయోగ పడుతున్నాయి. మండలంలో మాతృపంటగా సాగుచేసే పత్తికి మాత్రం సరిపడ వర్షం పడలేదని రైతులు పేర్కొంటున్నారు. భారీ వర్షం కురిస్తే తప్పా పత్తి, మిరప సాగు చేయలేమని చెబుతున్నారు.


గుంప్రమాన్‌దిన్నెలో సాగైన మినుము పైరు


క్రిష్టిపాడులో సాగుచేసిన మొక్కజొన్న పంట

• జోరుగా పంటల సాగు

దొర్నిపాడు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాలు అదును కావడంతో రైతులు పత్తి, మిరప పంటల సాగుకు శ్రీకారం చుట్టారు. మహిళలు పత్తి విత్తనాలు నాటుతుండగా, కాడెద్దుల సాయంతో మిరప విత్తనాలు వేశారు. శనివారం మండలంలోని పొలాల్లో రైతులు, కూలీలతో సందడిగా మారాయి. కాగా ఏటా పత్తి పంట జిల్లాలోనే అధికంగా సాగు చేసేవారు. అయితే దిగుబడి తగ్గడంతో రెండేళ్లుగా రైతులు మిరప సాగుకు మొగ్గు చూపుతున్నారు.


బుర్రారెడ్డిపల్లె పొలాల్లో ఎద్దుల కాడితో మిరప విత్తనాలు వేస్తున్న రైతులు


దొర్నిపాడులో పొలాల్లో పత్తి విత్తనాలను నాటుతున్న మహిళలు

క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి విశేష పూజలు


సామూహిక కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

రుద్రవరం: మండలంలోని కొండమాయపల్లె పంచాయతీ మజరా వెగలపల్లె పొలిమేరలో వెలసిన లక్ష్మీ,గోదా సమేత వాసాపురం వేంకటేశ్వర స్వామికి శనివారం భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు మధు సూదన్‌రెడ్డి, రంగనాయకులు,నరసింహులు ఆధ్వర్యంలో అర్చకులు ఉదయాన్నే స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు గావించారు. పట్టువస్త్రాలు,పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో క్యూ లైన్లు కిటకిటలాడాయి. ఆలయంలో సామూహిక కుంమార్చన చేపట్టడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చి భక్తులు పాల్గొన్నారు.

తోటల సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

ఉయ్యాలవాడ : ఉద్యానవన పంటలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకం కింద పూర్తి సబ్సిడీతో పండ్ల మొక్కలను రైతులకు అందజేస్తుందని ఏపీడీ సాంబశివరావు చెప్పారు. శనివారం మండలంలోని రూపనగుడి గ్రామంలో ఫీడర్ కెనాల్‌లో చేపట్టిన పూడికతీత పనులు, ఉయ్యాలవాడ, సుద్దమల్ల గ్రామాల్లో నాటిన కొబ్బరి, మునుగ మొక్కలను పరిశీలించారు. ఏపీఓ రవిప్రకాష్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లో రాణించాలి

నంద్యాల(న్యూటౌన్): విద్యార్థులు విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని నారాయణ విద్యాసంస్థల కోర్ డీన్ లింగేశ్వరరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని ఆర్‌కే ఫంక్షన్ హాల్‌లో నారాయణ కళాశాల 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మెమొంటోలు ఇచ్చి అభినందించారు.

పిల్లలందరూ బడిలో ఉండాలి

నంద్యాల(న్యూటౌన్): 5- 18 సంవత్సరాల్లోపు పిల్లలందరూ తప్పని సరిగా చదువుకోవాలని, వారి వయస్సులను బట్టి పాఠశాలల్లో, ఉండాలని ఎంఈఓ బ్రహ్మంనాయక్ సూచించారు. శనివారం పట్టణంలోని సచివాలయ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలతో సమావేశం నిర్వహించారు. బడిఈడు పిల్లల నమోదు గురించి పలు సూచనలు చేశారు. ఎంఈఓ-2 శివరాంప్రసాద్ పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

ఆళ్లగడ్డ: ఎస్సీ వర్గీకరణే లక్ష్యంగా చేస్తున్న పోరాటంలో భాగంగా ఆగస్టులో చేపట్టనున్న హలో మాదిగ - చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సుభాష్‌చంద్ర కోరారు. స్థానిక ప్రభుత్వ అతిథి గృహ ఆవరణలో శనివారం నియోజకవర్గ కార్యాకర్తల సమావేశం నిర్వహించారు. మేకల దస్తగిరి, రామాంజనేయులు, ఓబులేసు, సత్యనారాయణ ఉన్నారు.

బీజేపీని సాగనంపుదాం

నంద్యాల(న్యూటౌన్): కార్మిక ఉద్యోగ వ్యతిరేక విధానాలపై ఐక్యపోరాటాలు నిర్వహించి కేంద్రంలోని బీజేపీని సాగనంపుదామని మాజీ ఎమ్మెల్యే, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏఈ గఫూర్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు ఏసురత్నం అధ్యక్షతన జిల్లా నిర్మాణ వర్క్‌షాప్ నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి వైద్య సదస్సు ప్రారంభం


సదస్సును ప్రారంభిస్తున్న వైద్యులు

నంద్యాల టౌన్: ఆంధ్రప్రదేశ్ ఈఎన్‌టీ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో మధుమణి చారిటబుల్ సొసైటీ సహకారంతో, స్థానిక మధుమణి నర్సింగ్ హోంలో శనివారం రాష్ట్ర స్థాయి చెవి, ముక్కు, గొంతు శస్త్ర చికిత్సల రెండు రోజుల వైద్య వైజ్ఞానిక సదస్సు ప్రారంభమైంది. నిర్వాహకులు డాక్టర్ మధుసూదనరావు మాట్లాడుతూ 13 సంవత్సరాలుగా సదస్సు నిర్వహిస్తున్నామని, సదస్సుకు ఆరు రాష్ట్రాల నుంచి 200 మంది చెవి, ముక్కు, గొంతు వైద్యులు పాల్గొని అధునాతన వైద్యవిధానాలు, శస్త్రచికిత్సల్లో మెళకువలను వివరిస్తారని చెప్పారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ రవి కృష్ణ, రాష్ట్ర చెవి, ముక్కు, గొంతు వైద్యుల సంఘం అధ్యక్షులు డాక్టర్ కుమార్ చౌదరి, కార్యదర్శి డాక్టర్ రెహమాన్,డాక్టర్లు నాగమణి, మణిదీప్, మధుప్రీతి, ప్రణీత్, సింధు పాల్గొన్నారు.

రుద్రవరం వాసికి డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న గంగిశెట్టి వెంకటేష్

రుద్రవరం: మండల కేంద్రానికి చెందిన గంగిశెట్టి వెంకటేష్ చెన్నై ఐఐటీలో శనివారం హెచ్ఓడీ చంద్రమౌళి నుంచి డాక్టరేట్ అందుకున్నాడు. గంగిశెట్టి తిమ్మయ్య,రమాదేవి దంపతుల కుమారుడైన వెంకటేష్ చెన్నైలో ఐఐటీలో మెకానిజం ఫ్యూఎల్‌సెల్ విభాగంలో ఐదేళ్ల పాటు పరిశోధన చేసి ప్రయోగ పత్రాన్ని సమర్పించాడు. ఆయనకు కుటుంబ సభ్యులు, స్థానిక ఆర్యవైశ్య సంఘం సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందనలు తెలిపారు.

మృతి చెందిన హోంగార్డు భార్యకు ఉద్యోగం

బొమ్మలసత్రం: హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ బ్రెయిన్ స్ట్రోక్‌తో మృతిచెందిన మోహన్‌రెడ్డి భార్య దీపికకు ఉద్యోగం కల్పిస్తూ ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి ఉత్తర్వులు అందించారు. శనివారం స్థానిక కార్యాలయంలో దీపికకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయాన్ని ఎస్పీ అందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ విధినిర్వహణలో మృతిచెందిన పోలీసు కుటుంబాలకు అండగా నిలుస్తామన్నారు. ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ డీఎస్పీ రంగముణి, ఏఆర్ సీఐ సుధాకర్ ఉన్నారు.


దీపికకు హోమ్‌గార్డు ఉద్యోగం ఉత్తర్వులను అందిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

మెరుగైన సేవలు అందించండి

ఉయ్యాలవాడ: వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్య సేవలు అందించాలని రాష్ట్ర ఐడీసీ చైర్మన్ కర్రా గిరిజారెడ్డి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ సూచించారు. శనివారం మండలంలోని పెద్దయమ్మనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, హెల్త్ సూపర్‌వైజర్ మునిస్వామి, పాల్గొన్నారు.


పెద్దయమ్మనూరు పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న కర్రా గిరిజ, ఎంపీపీ

కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలి

నంద్యాలటౌన్: పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ ఆశా నోడల్ అధికారి తమ పరిధిలో జాతీయ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమాలైనఆర్‌సీహెచ్ పోర్టర్, హెచ్‌ఎంఐఎస్ పోర్టల్, సీఎస్ఎస్ఎం, మిషన్ ఇంద్ర ధనుష్‌ను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి వెంకటరమణ సూచించారు. శనివారం జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలలో పని చేస్తున్న నోడల్ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. శారదా బాయి, మల్లికార్జునరెడ్డి, కాంతారావు నాయక్, చంద్రశేఖర్, జగదీష్ సుజాత పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకట రమణ

రక్త దానంపై అవగాహన కల్పించాలి

రక్త నిల్వలు తగ్గిపోకుండా ఉండేందుకు రక్తదానం పట్ల ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటరమణ అన్నారు. స్థానిక డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయంలో రక్త కేంద్రాల అధికారులతో సమావేశం నిర్వహించారు.

పారదర్శక పాలన జగనన్నతోనే సాధ్యం


పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి

గోస్పాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అవినీతి రహితపాలన అందిస్తూ ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే శిల్పారవిచంద్ర కిశోర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జూలేపల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ బుక్‌లెట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజల ఇంటికే సంక్షేమం నేరుగా అందిస్తూ వారి మనసుల్ని జగనన్న చూరగొన్నారన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీల నాయకులు బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి నూతన అధ్యాయాన్ని లిఖించారని కొనియాడారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్కు ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, సర్పంచ్ పుల్లయ్య, ఎంపీటీసీ సుబ్రహ్మణ్యం, నాయకులు రాజారెడ్డి, కాంతారెడ్డి, మాజీ సర్పంచ్ పార్థసారథిరెడ్డి, రామనాథరెడ్డి, రామసుబ్బారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

మణిపాల్ ఘటనలపై చర్యలు తీసుకోవాలి


నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

నంద్యాల(న్యూటౌన్): మణిపాల్‌లో చోటుచేసుకుంటున్న ఘటనలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థినులు కోరారు. శనివారం స్థానిక మహిళా ప్రభుత్వ కళాశాల ఆవరణలో విద్యార్థినులు నిరసన కార్యక్రమం చేపట్టారు. వైఎస్సార్‌సీపీ జేసీఎస్ కన్వీనర్ సాయిరాంరెడ్డి మాట్లాడుతూ మణిపాల్ ఘటనలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నంద్యాల(వ్యవసాయం): ప్రధాన మంత్రి, కేంద్ర హోంమంత్రి, మణిపూర్ ముఖ్యమంత్రి వెంటనే రాజీనామా చేయాలని ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక నంద్యాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జమాతే ఇస్లామి హింద్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

నంద్యాల(అర్బన్): మణిపూర్ కుకీ తెగ స్త్రీలను వివస్త్రలను చేసి ఊరేగించిన దుండగులను శిక్షించాలని దళిత బహుజన ఐక్యకార్యాచరణ కమిటీ అధ్యక్షుడు మేకల లింగస్వామి, గౌరవాధ్యక్షులు కొమ్ముపాలెం శ్రీనివాసులు, ఏపీ వెంకటసుబ్బయ్య శనివారం డిమాండ్ చేశారు.

ఉత్తర్వులను ఉపసంహరించుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయుల పని సర్దుబాటు ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర కార్యదర్శి నగరి శ్రీనివాసులు నంద్యాల జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవస్వామి, సాంబశివుడు కోరారు. శనివారం స్థానిక జిల్లా కార్యాలయంలో ఉపాధ్యాయుల సమావేశంలో వారు మాట్లాడుతూ. ఉమ్మడి జిల్లాలో అన్ని సబ్జెక్టుల్లో పాఠశాల సహాయకుల పని సర్దుబాటు పేరిట నేడు ఉత్తర్వులు ఇచ్చారని, అయితే కౌన్సెలింగ్ లేకుండా నేరుగా ఉత్తర్వులు ఇవ్వడం నిబంధనలకు విరుద్ధమన్నారు. పుల్లయ్య, రవి, మునిస్వామి, పవన్‌కుమార్, వెంకటేశ్వర్లు, గోపాల్‌రావు, మద్దిలేటి, కృష్ణమూర్తి, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

దొర్నిపాడు: సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ నాగసాయి సూచించారు. శనివారం డబ్ల్యూ.కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని వెంకటేశ్వరనగరం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

విద్యుత్ డీఈఈగా రవికాంత్

ఆళ్లగడ్డ : సబ్‌డివిజన్ నూతన విద్యుత్ డీఈఈగా రవికాంత్‌చౌదరి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీఈఈగా విధులు నిర్వహిస్తున్న సుబ్రహ్మణ్యంను నంద్యాల ఎస్పీఎంకు బదిలీ చేయడంతో ఆ స్థానంలో నంద్యాలలో విధులు నిర్వహిస్తున్న రవికాంత్ చౌదరిని ఇక్కడికి బదిలీ చేశారు.

పథకాల అమలులో రాజకీయాలకు స్వస్తి

దొర్నిపాడు: గతంలో తమ వర్గానికే ప్రభుత్వ పథకాలు అందిస్తూ రాజకీయ సంప్రదాయాలు కొనసాగించేవారని, జగనన్న పాలనలో అర్హతే ప్రామాణికంగా కుల, మత, వర్గం, పార్టీలకు అతీంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం చాకరాజు సచివాలయ పరిధిలోని వెంకటేశ్వరనగరంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి పథకాల అమలు, పాలన తీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అయితే ప్రతి ఇంటి వద్ద ఆయనకు సంతృప్తికర సమాధానాలే లభించాయి. ఆయా వీధుల్లో స్థానికులు ప్రస్తావించి పలు సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతిపక్షాల విమర్శలు, ఆరోపణలకు.. తమ పథకాలు, పాలన, అభివృద్ధే సమాధానం చెబుతాయని, ఏదైనా సందేహముంటే ప్రజల వద్దకు వెళ్లి అడిగితే వారే సరైన వివరణ ఇస్తారని చెప్పారు. తమ ప్రభుత్వం ఏమి చేసింది, సంక్షేమ పథకాల ద్వారా గ్రామానికి ఎంత లబ్ధి జరిగింది వివరాలను ప్రజలకు వివరించారు.

గడప గడప నిధులపై సమీక్ష..

చాకరాజువేముల సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తి కావడంతో వెంటనే డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ కొండారెడ్డి, ఎంపీడీఓ సుబ్బారెడ్డితో సమీక్ష సమావేశం నిర్వహించి రూ.46 లక్షలకు సంబంధించిన సీసీ రోడ్ల నిర్మాణ పనులపై తీర్మానించారు. వెంటనే ప్రతిపాదనలు పంపాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ అమన్‌నాథ్ రెడ్డి, సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, నాయకులు మోహన్‌నాయుడు, కాంట్రాక్టర్ శివరామిరెడ్డి, బత్తుల కృష్ణయ్య, దాబా మనోహర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, బోయిన వాసు, బోయిన సుబ్బయ్య, మన్నె వీరరాఘవులు, త్రినాథచౌదరి, నెక్కంటి శ్రీనివాసులు, రాజు, పెద్దబ్బులు, మన్నె శ్రీనివాసులు, తమ్మిన భాస్కర్‌రావు, ఎస్. హుసేన్‌బాషా, ఖలీల్ బాషా, తహసీల్దార్ జయప్రసాద్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుప్రియ పాల్గొన్నారు.


లబ్ధి పొందిన పథకాలను చదివి వినిపిస్తున్న ఎమ్మెల్యే గంగుల

రుద్రవరం: అర్హత ఉన్న ప్రతి కుటుంబం సంక్షేమ పథకాలు పొందాయని, దీంతో ప్రభుత్వానికి ప్రజలే అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండంలోని ఆర్. నాగవరం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి ఇంటింటా తిరిగి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. ఆయన మాట్లాడుతూ చంద్రబాబు అండ్‌కో ఎన్ని కుయుక్తులు పన్నినా ప్రజలు జగనన్న ప్రభుత్వం వైపే ఉన్నారన్నారు. కల్లిబొల్లి మాటలకు మోసపోయే కాలం చెల్లిందని, ఉత్తిత్తి హామీలకు ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ వ్యవసాయ మార్కెట్‌యార్డు చైర్మన్ గంధం రాఘవరెడ్డి, సర్పంచ్ గంధం సావిత్రమ్మ, ఉప సర్పంచ్ సింహం, సింగిల్ విండో చైర్మన్ నాగేశ్వరరెడ్డి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, నాయకులు మోహన్‌రెడ్డి, ఎర్రన్న, తిరుపతి రెడ్డి, ప్రసాద్‌రెడ్డి, అబ్బి, నారాయణ, ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి, తహసీల్దార్ రవీంద్రప్రసాద్, ఏఈలు వెంకటరాముడు, ప్రమోద్, ఏపీఓ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ


ఆర్.జంబులదిన్నెలో విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ

ఉయ్యాలవాడ : ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోందని ఎంఈఓ వీర ప్రతాప్‌రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని ఆర్.జంబులదిన్నె, పెద్దయమ్మనూరు గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వం మంజూరు చేసిన సెమిస్టర్-2 పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు.


చాగలమర్రిలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓ అనురాధ

చాగలమర్రి: స్థానిక గుంతపాళెం వీధిలోనున్న ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ అనురాధ శనివారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులకు సెకండ్ సెమిస్టర్ పుస్తకాలను పంపిణీ చేశారు.

పంట కాల్వ తవ్వకానికి చర్యలు

రుద్రవరం: మండల కేంద్రం సమీపంలోని తెలుగుగంగ 20వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వ నుంచి పంట కాల్వ తవ్వేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆ శాఖ ఏఈ రామశేషు తెలిపారు. తెలుగుగంగ కాల్వలు తవ్వే సమయంలో ప్రధాన,ఉప ప్రధాన కాల్వలతో పాటు పంట కాల్వలు తవ్వారు. అయితే కొన్ని చోట్ల భూసమస్యలు,రైతుల మధ్య సమన్వయం లేక పంట కాల్వల నిర్మాణాలు నిలిచి పోయాయి. దీంతో సాగు నీరు అందక పంటలు పండించుకోలేక పోతున్నామని రుద్రవరానికి చెందిన పలువురు రైతులు ఇటీవల నంద్యాలకు వెళ్లి స్పందనలో ఫిర్యాదు చేశారు. అసంపూర్తిగా నిలిచిన పంట కాల్వను పరిశీలించారు. వారు మాట్లాడుతూ నివేదికలను ఉన్నతాధికారుకుల పంపి కాల్వ పనులు పూర్తి చేయిస్తామని తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్ట్

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంతో పాటు ఆళ్లగడ్డలోని పలు ఇళ్లలో చోరీలకు పాల్పడిన ఐదుగురు దొంగలను టూటౌన్ పోలీసులు శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ ప్రభాకర్ తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని పద్మావతినగర్‌లో గత నెల ఒక ఇంట్లో, త్రీటౌన్ పరిధిలోని లైఫ్ హాస్పిటల్ సమీపంలోని మరో ఇంట్లో చోరీకి పాల్పడగా నాడు పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం ఉదయం చాబోలు రస్తాలో ఐదుగురు యువకులు పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా పట్టణంలోని రెండు ఇళ్లతో పాటు ఆళ్లగడ్డలోని మరో ఇంట్లో చోరీకి పాల్పడినట్లు ఒప్పుకున్నారు. చోరీకి పాల్పడిన వారిలో ఆళ్లగడ్డకు చెందిన పండింటి ఉత్కర్ష్, నంద్యాల పట్టణం బైర్మల్ వీధికి చెందిన తంబి పవన్, సాధిక్‌నగర్‌కు చెందిన చాగం వెంకటనాగచరణ్‌రెడ్డి, నర్స్ క్వార్టర్స్‌కు చెందిన పసుపులేటి మహేంద్ర, విశ్వనగర్‌కు చెందిన కందుకూరి హేమంత్‌కృష్ణ ఉన్నారు. వీరి నుంచి 10.50 తులాల బంగారు ఆభరణాలు, రూ.3.25 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో నిందితుడు దేవనగర్‌కు చెందిన పోలుగారి వినయ్‌కుమార్ పరారీలో ఉన్నాడని సీఐ వివరించారు.

ఎస్‌బీఐ అధికారులపై కేసు నమోదు చేయండి

ఆళ్లగడ్డ: తనకు నోటీసులు ఇచ్చేందుకు తన ఖాతా నుంచే డబ్బులు తీసుకున్నారని బాధితుడు కోర్టును ఆశ్రయించగా.. స్థానిక స్టేట్ బ్యాంక్ అధికారులపై కేసు నమోదు చేయాలని ఆళ్లగడ్డ కోర్టు రూరల్ పోలీసులను ఆదేశించింది. ఫిర్యాదుదారుడు బద్రి రామలింగయ్య తెలిపిన వివరాల మేరకు.. నల్లగట్ల గ్రామానికి చెందిన రామలింగయ్య 2018లో తన గోడౌన్‌లో నిల్వ ఉన్న మినుములపై రుణం తీసుకున్నాడు. 2020 ఫిబ్రవరి 22న వారం రోజుల్లో చెల్లించకపోతే వేలం వేస్తామని నోటీసు పంపిచారు. దీంతో రామలింగయ్య 28న రుణం చెల్లించాడు. అనంతరం తన ఖాతా స్టేట్‌మెంట్ చూడగా రూ.20 వేలు తన అకౌంట్ నుంచి ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. ఇందేంటి ప్రశ్నించగా..నీపై సూట్ ఫైల్ చేసేందుకు డ్రా చేశామన్నారు. 29వ తేదీ వరకు గడువు ఉండగా 27నే ఎలా ట్రాన్స్‌ఫర్ చేస్తారని కోర్టును ఆశ్రయించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్ఐ నరసింహులు తెలిపారు.

'జగనన్న సురక్ష'తో అర్హులకు పథకాలు

ఆళ్లగడ్డ: అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందుకోలేని వారిని గుర్తించి వందశాతం పథకాల లబ్ధి చేకూర్చడమే 'జగనన్న సురక్ష'లక్ష్యమని ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్ అన్నారు. రూరల్ మండలం ఆర్‌కృష్ణాపురం గ్రామ సచివాలయ పరిధిలో శనివారం కార్యక్రమం నిర్వహించారు. ఈఓఆర్డీ తాహెర్‌హుసేన్, ఎంపీటీసీ లక్ష్మీదేవి, సర్పంచ్‌లు సుభద్రమ్మ, రాజేశ్వరి, నాయకులు కృష్ణారెడ్డి, రంగారెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, తులసి ఉన్నారు.

ఉయ్యాలవాడ : అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు, సేవలను చేరువ చేసి ప్రజల ముఖాల్లో చిరునవ్వులు చిందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర ఐడీసీ చైర్మన్ కర్రా గిరిజారెడ్డి, ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ అన్నారు. శనివారం మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఐడీసీ చైర్మన్, ఎంపీపీ, మాజీ గ్రామ సర్పంచ్ బత్తుల రామచంద్రుడు పాల్గొని 232 మందికి ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు. నాయకులు కర్రా తేజావర్ధన్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నారాయణరెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని 9 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ముగిసింది. చివరి రోజు దొర్నిపాడు-2 సచివాలయంలో ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించి 658 ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవమణి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, నాయకులు నర్సిరెడ్డి, చిన్నవెంకటరామిరెడ్డి, లక్ష్మీకాంత్‌రెడ్డి, తహసీల్దార్ జయప్రసాద్, ఎంపీడీఓ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

చాగలమర్రి: జగనన్న సురక్ష కార్యక్రమం నిరుపేదలకు శ్రీరామరక్ష అని ఎంపీపీ ఆర్.వీరభద్రుడు అన్నారు. ఆయన శనివారం మండలంలోని చింతలచెరువు, చిన్నవంగలి గ్రామాలలో ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, తహసీల్దార్ సుభద్రమ్మ, ఈఓపీఆర్‌డీ సుదర్శనరావుల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. జెడ్పీటీసీ జి.లక్ష్మీదేవి, సర్పంచ్ మౌళి బాషా, ఎంపీటీసీలు ఎద్దుల రాజేశ్వరి, కె.లక్ష్మీరెడ్డి పాల్గొని సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. చింతలచెరువులో 151 మందికి, చిన్నవంగలిలో 298 మందికి సర్టిఫికెట్లు పంపిణి చేశారు. నాయకులు ఎ.లక్ష్మీరెడ్డి, గణపతి రెడ్డి, మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి, బచ్చు సుబ్రమణ్యం, రామగురివరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. అలాగే.. చిన్నవంగలి గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు కె.లక్ష్మీరెడ్డి ఆధ్వర్యంలో సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వివిధ సంక్షేమ పథకాల కింద గ్రామస్తులకు ఇప్పటి వరకు రూ.6,59,08,505 లబ్ధి చేకూరిందని వివరించారు.


చింతల చెరువులో ధ్రువ పత్రం అందజేస్తున్న అధికారులు, నాయకులు

నంద్యాల(అర్బన్): అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని ఎంపీడీఓ సుగుణశ్రీ తెలిపారు. మండలంలోని పులిమద్ది గ్రామంలో సర్పంచ్ రఘురామిరెడ్డి అధ్యక్షతన జగనన్న సర్క్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో 927 మందికి ధ్రువపత్రాలను అందించారు.

గోస్పాడు: జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నట్లు ఎంపీపీ ఆర్థర్ సైమన్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు ప్రహ్లాదరెడ్డి, వైస్ ఎంపీపీ రాజు తెలిపారు. మండల కేంద్రంలో శనివారం మండలస్థాయి అధికారుల ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించి 421 మందికి ధ్రువ పత్రాలు పంపిణీ చేశారు.

25న పాఠశాలల బంద్

నంద్యాల(న్యూటౌన్): విద్యారంగ సమస్యల పరిష్కారించాలని ఈనెల 25వ తేదీన విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నామని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, రాజునాయుడు, నాగార్జున కోరారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఏ, ఏఐఎస్‌బీ విద్యార్థి సంఘాలు పాల్గొన్నాయి.

మద్యం అధిక ధరలకు అమ్మితే చర్యలు

ఆళ్లగడ్డ: నిర్ణయించిన ధరల కంటే మద్యాన్ని అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి రవికుమార్‌రెడ్డి హెచ్చరించారు. శనివారం నియోజకవర్గంలోని ఆళ్లగడ్డ, శిరివెళ్ల, యర్రగుంట్లలోని మద్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారులను అడిగి ధర, సమయపాలనను తెలుసుకున్నారు. ఎస్ఐ అస్లాంబేగ్ ఉన్నారు.

ఓటరు సర్వే సక్రమంగా నిర్వహించాలి

నంద్యాల(అర్బన్): కొత్తగా ఓటరు నమోదు, ఆధార్ సీడింగ్ నమోదు కార్యక్రమాన్ని బీఎల్‌ఓలు సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. ఇంటింటికీ వచ్చే బీఎల్‌ఓలకు ఓటర్లు సహకరించాలని కోరారు. స్థానిక కార్యాలయంలో శనివారం బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ చంద్రనాయక్ పాల్గొన్నారు.

దొర్నిపాడు: ఓటరు జాబితాను నిశితంగా పరిశీలించి తప్పులు లేకుండా సవరించాలని తహసీల్దార్ జయప్రసాద్ బీఎల్‌ఓలకు సూచించారు. శనివారం మండలంలోని చాకరాజువేముల గ్రామంలోని 28వ పోలింగ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఓటరు జాబితా ఇంటింటి పరిశీలనను తనిఖీ చేశారు.


మార్కెట్ యార్డులోని రైతుబజార్‌లో సబ్సిడీ టమాట కోసం క్యూలో వినియోగదారులు

సబ్సిడీ టమాటకు పోటెత్తిన జనం

నంద్యాల(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీ టమాట కోసం జనం పోటెత్తారు. శనివారం ఉదయం స్థానిక మార్కెట్ యార్డులోని రైతుబజార్‌లో ఉదయం 5 గంటల నుంచి పంపిణీ ప్రారంభించారు. వినియోగదారులు భారీగా రావడంతో మూడు గంటల్లోనే పంపిణీ పూర్తయ్యింది. జిల్లా అగ్రిట్రేడింగ్ మార్కెటింగ్ అధికారి అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ.. అన్నమయ్య జిల్లా మదనపల్లె నుంచి 2 టన్నులు టమాట తీసుకొచ్చి పంపిణీ చేశామన్నారు.